సాక్షి నిర్మల్

బుధవారం। 24। జూలై। 2024



పట్టపగలే చోరీలు..

జిల్లాలో పట్టపగలే దొంగలు రెచ్చిపోతున్నారు. పట్టుకోండి చూద్దాం అన్నట్లు పోలీసులకే దొంగలు సవాల్ విసురుతున్నారు.

IIలో▸



డిగ్రీ కళాశాల అరుదైన ఘనత

నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అరుదైన ఘనతను చాటుకుంది. 'హైమ్ అంతర్జాతీయ సంస్థ' ప్రతినిధులు కళాశాలను సందర్శించారు.

IIలో▸

గరిష్టం/కనిష్టం
27.4 /24.3

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమవుతుంది. అల్ప పీడనం, రుతుపవనాల ప్రభావంతో జిల్లా అంతటా ఈదురు గాలులతో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ప్రభుత్వ వ్యతిరేక నిర్ణయాలపై కఠిన చర్యలు

నిర్మల్‌చైన్‌గేట్: ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠి నచర్యలు తప్పవని అదనపు కలెక్టర్ ఫైజాన్ అ హ్మద్ హెచ్చరించారు. జిల్లాలోని గ్రామ పంచా యతీ అధికారులు అనధికారికంగా విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీలు ఏర్పాటుచేసుకుని ప్రజల ను భయపెడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందకుండా అడ్డుకుంటునానరని పేర్కొన్నారు. అలాంటి వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'డబుల్‌బెడ్రూం' లబ్ధిదారుల నిరసన



మాట్లాడుతున్న ఆర్డీవో కోమల్‌రెడ్డి

భైంసాటౌన్: పట్టణ శివారులో తమకు మంజూరైన డబుల్‌బెడ్రూం ఇళ్లను వెంటనే అప్పగించాలని లబ్ధిదారులు డిమాండ్ చేశారు. భైంసా ఆర్డీవో కార్యాలయానికి మంగళవారం చేరుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇళ్లు కేటాయించి ఏడాది గడుస్తున్నా ఎందుకు అప్పగించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అద్దె ఇళ్లలో ఉంటూ అవస్థలు పడుతున్నామని, అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరిగి విసిగిపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్డీవో కోమల్‌రెడ్డి మాట్లాడుతూ.. డబుల్ బెడ్రూం ఇళ్లు ప్రస్తుతం నివాసయోగ్యంగా లేవన్నారు. మౌలిక వసతుల కల్పన కోసం నిధులు రావాల్సి ఉందన్నారు. వసతులు కల్పించిన ఇళ్లు అప్పగిస్తామని తెలిపారు. దీంతో లబ్ధిదారులు ఆందోళన విరమించారు.

ఎల్లమ్మకు వెండి కిరీటం బహూకరణ




దాతను సన్మానిస్తున్న సభ్యులు

ఖానాపూర్: మండలంలోని దిలావర్‌పూర్ గ్రామంలోని రేణుక ఎల్లమ్మ తల్లికి తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ కొత్త శ్రీనివాస్ రూ.65 వేల విలువైన వెండి కిరీటాన్ని బహూకరించారు. గ్రామంలోని ఆలయంలో అర్చకుడు ప్రశాంత్ మంగళవారం ప్రత్యేక పూజలు చేసి కిరీటాన్ని అమ్మవారికి అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దాతను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు గుగ్గిల్ల సంతోష్‌గౌడ్, సిద్దం రామగౌడ్, నర్సయ్య, బత్తిని శేఖర్, గుగ్గిల్ల రాజేశ్వర్, ఆరెల్ల శ్రీనివాస్, అదనుపురం శేఖర్, గంగన్న, గంగాధర్, మల్లేశ్, నాగరాజు, తదితరులు ఉన్నారు.

రేపు వాహనాల వేలం

నిర్మల్‌చైన్‌గేట్: ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా ఎక్సైజ్ అధికారి ఎం.డీ.రజాక్ ఆధ్వర్యంలో ఎక్సైజ్ కేసులలో పట్టుబడిన వాహనాలను ఈనెల 25 గురువారం వేలం వేయనునన్నట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ జి.లక్ష్మణ్ తెలిపారు. ద్విచక్ర వాహనాలు 18, మహేంద్ర బొలెరో 1, కార్లు 3, ప్యాసింజర్ ఆటోలు 3, ట్రాలీ ఆటో ఒకటి మొత్తం 26 వాహనాలు వేలం వేస్తున్నట్లు వివరించారు. బహిరంగ వేలం నిర్మల్ ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు. ఆసక్తిగల వారు డిపాజిట్ చెల్లించి బహిరంగ వేలంలో పాల్గొనాలని సూచించారు. వివరాలకు 87126 58791, 99666 68991 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

'కడెం'కు స్వల్పంగా ఇన్‌ఫ్లో



నిండుగా కడెం ప్రాజెక్ట్

కడెం: కడెం ప్రాజెక్టులోకి వరద తగ్గుముఖం పట్టింది. ప్రాజెక్ట్ పూర్తి నీటిమట్టం 700(7.603 టీఎంసీ) అడుగులు కాగా, ప్రస్తుతం 691.700(6.619టీఎంసీ) అడుగులు ఉంది. ప్రాజెక్టులోకి మంగళవారం 3,640 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుందని అధికారులు తెలిపారు. ఇన్‌ఫ్లో పెరిగితే వరద గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తామన్నారు. పరీవాహక గ్రామాల ప్రజలు, పశువుల కాపరులు, జాలర్లు నదిలోకి వెళ్లొద్దని సూచించారు.

ఆశ నిరాశల పద్దు..

- జిల్లాపై కరుణ చూపని నిర్మలమ్మ
- నేరుగా లబ్ధి చేకూర్చని బడ్జెట్
- వ్యవసాయ, కార్మిక రంగాలకు మేలు
- ముద్ర రుణాల పెంపుపై హర్షం
- చాలా రంగాలకు నిరాశజనకమే



నిర్మల్: వరుసగా రెండుసార్లు బీజేపీ ఎంపీలను గెలిపించినా జిల్లాపై కేంద్రం చిన్నచూపే చూస్తోంది. ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో జిల్లాకు నేరుగా లబ్ధి చేకూర్చే విషయాలేవీ లేవు. ఎప్పటి నుంచో ఆశిస్తున్న రైల్వేలైన్ విషయంలో మరింత స్పష్టత రావాల్సి ఉంది. ఎన్‌హెచ్ 44ను ఆరులైన్లు, ఎన్‌హెచ్.61ను నాలుగులైన్లు చేయాల్సిన అవసరంతోపాటు బాసర–భైంసా నుంచి మహోర్ వరకు ఆధ్యాత్మిక వారధిని పొడగించాల్సిన అవశ్యకతపైనా స్పష్టత లేదు. కేంద్రం గతంలో ఇచ్చిన హామీలనూ పెండింగ్‌లో పెట్టినట్లే కనిపిస్తోంది. ఇక చిరువ్యాపారులకు ఆసరాగా నిలిచే ముద్రలోన్లు రూ.20 లక్షలకు పెంచడంపై హర్షం వ్యక్తమవుతోంది. కేంద్ర బడ్జెట్‌పై బీజేపీ సానుకూలంగా స్పందించగా, మిగితా పార్టీలు రాష్ట్రాన్ని చిన్నచూపు చూశారని, జిల్లాకు అన్యాయం జరిగిందని పేర్కొంటున్నారు.

ఆ తొమ్మిదిరంగాలకు..

కేంద్ర బడ్జెట్‌లో ప్రధానంగా తొమ్మిది రంగాలపై దృష్టిపెట్టారు. వ్యవసాయంలో ఉత్పాదకతను పెంచేందుకు రూ.1.52 లక్షల కోట్లు కేటాయించారు. వ్యవసాయాధారిత జిల్లాకు ఇందులో చోటు లభించనుంది. ఉద్యోగం, నైపుణ్యాలు పెంచడానికి భారీగానే కేటాయింపులు, ఆకర్షణీయ పథకాలు తీసుకువచ్చారు. స్థానికంగా సరైన ఉపాధి లేకపోవడంతో జిల్లా నుంచి ఇప్పటికీ వేలమంది గల్ఫ్‌దేశాల బాటపడుతున్నారు. వీరిలో కొందరికైనా ఈ బడ్జెట్ ద్వారా ఉపశమనం కలుగుతుందని భావిస్తున్నారు. గ్రామీణ, పట్టణాభివృద్ధిలో భాగంగా జిల్లాకు భారీగా నిధుల కేటాయింపులు అవసరం. ఇప్పటికీ జిల్లాలో గ్రామాలు, పట్టణాల్లో సరైన మౌలిక వసతులు లేవు.

ఆశలపై రావాలి స్పష్టత..

దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న జిల్లావాసులు రైల్వేకలపై ఇప్పటికీ ఓ క్లారిటీ రావడం లేదు. ఈసారి బడ్జెట్‌లో కొత్తలైన్ల ఏర్పాటులో భాగంగా జిల్లా మీదుగా రైల్వేలైన్ ఏర్పాటుకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇస్తుందా.. ఈ బడ్జెట్ నిధులను కేటాయిస్తుందా.. అనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది. గత అక్టోబర్‌లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పటాన్‌చెరు నుంచి నిర్మల్ మీదుగా ఆదిలాబాద్ వరకు నూతన రైల్వేలైన్ వేస్తున్నట్లు ప్రకటించారు. ఇందులో సంగారెడ్డి జిల్లాలో ఇటీవల సర్వే నిర్వహించడం ఒక్కటే సానుకూలమైన అంశంగా కనిపిస్తోంది. గతంలో నిర్మల్‌లో ఈఎస్ఐ ఆస్పత్రి, భైంసాలో డిస్పెన్సరీ ఇస్తామన్న హామీలు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయి.

ప్రయోజనకర బడ్జెట్..



కేంద్ర బడ్జెట్ అన్నివర్గాలకు ప్రయోజనకరంగా ఉంది. మహిళలు, బాలికలకూ ప్రయోజనం చేకూరే విధంగా రూ.3 లక్షల కోట్లు కేటాయించారు. గ్రామీణాభివృద్ధికి రూ.2.66 లక్షల కోట్లు, ముద్ర రుణాలను రూ.20 లక్షలకు పెంచడం హర్షణీయం.
–అంజుకుమార్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

కేటాయింపులు శూన్యం..



కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రాన్ని చిన్నచూపు చూశారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే కేటాయింపులు చేశారు. జిల్లాకు ఈ బడ్జెట్‌లో ఒరిగిందేమీ లేదు. చాలారంగాలను కేంద్ర బడ్జెట్ నిరాశకు గురిచేసింది.
– కూచాడి శ్రీహరిరావు, డీసీసీ అధ్యక్షుడు

వేతన జీవులకు నిరాశే..



కొత్తపన్ను విధానంలో వేతన జీవులకు నిరాశే ఎదురైంది. కేంద్రం బడ్జెట్‌లో శుభవార్త చెబుతుందని ఎదురుచూశారు. స్టాండర్డ్ డిడక్షన్ కేవలం రూ.25 వేలు మాత్రమే పెంచారు. చిరుద్యోగులు, చిరువ్యాపారులకు బడ్జెట్ ప్రయోజనకరంగా ఉంది.
–భూమన్నయాదవ్, అర్థశాస్త్ర నిపుణుడు, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు

పలువర్గాలకు మేలు..



వికసిత్ భారత్ లక్ష్యంగా ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆశ నిరాశలతో కూడిన కేటాయింపులు ఉన్నాయి. ఉద్యోగకల్పన, ఎంఎస్ఎం ఈ రంగాలకు చేయూత బాగుంది. ముద్రలోన్ పరిమితి పెంచడం చాలామందికి ఉపయోగపడుతుంది.
– సురేశ్ మెట్‌పల్లి, ట్యాక్స్ కన్సల్టెంట్, నిర్మల్

దొంగతనాల కట్టడిపై ప్రత్యేక దృష్టి

- ఎస్పీ జానకీషర్మిల



మాట్లాడుతున్న ఎస్పీ జానకీషర్మిల

నిర్మల్ టౌన్: జిల్లాలో ఇటీవల వరుస చోరీలతో దొంగలు పోలీసులకు సవాల్ విసురుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న జిల్లా పోలీస్ బాస్ జానకీషర్మిల చోరీల నియంత్రణకు యాక్షన్‌ప్లాన్ చేపట్టారు. జిల్లా కేంద్రంలో మంగళవారం మధ్యాహ్నం జరిగిన చైన్ స్నాచింగ్‌పై ఎస్పీ స్పందించారు. స్వయంగా పట్టణ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి సమీక్ష నిర్వహించారు. బాధితులతో మాట్లాడి చైన్ స్నాచింగ్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దొంగలను పట్టుకుంటామని బాధితులకు భరోసా కల్పించారు.

పోలీసులకు దిశానిర్దేశం..

ప్రతీ దొంగతనంపై పూర్తిగా విచారణ చేయాలి, ఆధారాలు, వాస్తవాలను నిర్ధారించాలని ఎస్పీ పోలీసులకు సూచించారు. పట్టుకున్న దొంగలను కోర్టులో ప్రవేశపెట్టి శిక్ష పడేలా చేయాలని సూచించారు. దొంగతనాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి రాత్రిపూట పోలీస్ పెట్రోలింగ్ పెంచాలన్నారు. అర్ధరాత్రి సమయాల్లో ఎక్కువగా పెట్రోలింగ్ చేయాలన్నారు. ప్రధాన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు అమర్చాలని పేర్కొన్నారు. 'నేను సైతం' ప్రోగ్రాంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా వ్యాపారులు, పౌరులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా చూడాలన్నారు. ఎవరైనా దొంగతనాలపై సమాచారం ఇస్తే వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాని సూచించారు.

ఇన్‌ఫార్మర్ వ్యవస్థను బలోపేతం చేయాలి..

పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలని తెలిపారు. అప్పుడు సమాచారం వ్యవస్థ పటిష్టంగా ఉంటుందని తెలిపారు. దొంగతనాల సమాచారం అందించిన పౌరుల వివరాలు రహస్యంగా ఉంచాలన్నారు. పక్క రాష్ట్రాలు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వారిని గుర్తించి విచారణ చేయాలని ఆదేశించారు. సమావేశంలో నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి , పట్టణ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ అశోక్, క్రైమ్ ఇన్‌స్పెక్టర్ సురేందర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాలు పెంచాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్
- ప్రసూతి ఆస్పత్రి ఆకస్మిక తనిఖీ



ఆస్పత్రి పరిసరాలు పరిశీలిస్తున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: ప్రభుత్వ ఆస్పత్రిలో సిజేరియన్ ప్రసవాలు తగ్గించి, సాధారణ ప్రసవాలు పెంచాలని కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. నిర్మల్ పట్టణంలోని జిల్లా మాతా శిశు ఆస్పత్రిని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న వైద్య సేవల గురించి వైద్యులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రసూతి ఆస్పత్రిలో మహిళలకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. మాతా, శిశు సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఆసుపత్రికి వచ్చే గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. విధులను నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కలెక్టర్ వెంట జిల్లా బోధన ఆస్పత్రి పర్యవేక్షకులు డాక్టర్ సునీల్‌కుమార్, ప్రసూతి ఆస్పత్రి హెచ్‌వోడీ డాక్టర్ సరోజ, వైద్యులు ప్రదీప్, వాసు, విన్ని, నర్సింగ్ పర్యవేక్షకురాలు ధనలక్ష్మి, కార్యాలయ పర్యవేక్షకుడు నవీన్, నర్సింగ్, తహసీల్దార్ రాజు, అధికారులు రాంబాయియమ్మ, జన తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ స్థలాల ఆక్రమణదారులపై చర్య తీసుకోవాలి

నిర్మల్‌చైన్‌గేట్: ప్రభుత్వ స్థలాలు ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు కోవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరెట్‌లోని తన చాంబర్‌లో చెరువుల పరిరక్షణ జిల్లాస్థాయి కమిటీ సమావేశం సంబంధిత శాఖల అధికారులతో మంగళవారం నిర్వహించారు. శాఖలవారీగా ప్రభుత్వ స్థలాలు, వాటి రక్షణకు తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ స్థలాలు, చెరువు శిఖం భూములను ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాఖల వారీగా ప్రభుత్వ స్థలాల హద్దులను గుర్తించి కంచెలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. జిల్లాలోని ప్రతీ చెరువును మ్యాపింగ్ తయారు చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్ కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, నీరిపారుదల శాఖ ఈఈ లక్ష్మి, మున్సిపల్ కమిషనర్ రాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా రుణాలివ్వాలి

నిర్మల్‌చైన్‌గేట్: ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా రుణాలను మంజూరు చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ బ్యాంకు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో వార్షిక రుణ ప్రణాళిక 2024–25 సంవత్సరానికి సంబంధించిన పుస్తకాన్ని అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, బ్యాంక్ అధికారులతో కలిసి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మారుమూల గ్రామీణ ప్రాంతాలకు బ్యాంకు సేవలు అందించాలన్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, స్వయం సంఘాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు రుణాలు మంజూరు చేయాలన్నారు. రైతులకు పంట రుణాలను రెన్యూవల్ చేసి తిరిగి వందశాతం రుణాలు అందించాలన్నారు. 2024–25లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు, పీఎంఈజీపీ, పీఎం విశ్వకర్మ యోజన పథకాల ద్వారా చేతివృత్తుల వారికి రుణాలు, వ్యవసాయ పంటరుణాలు, చిన్న, మధ్యతరహా పరిశ్రమల లబ్ధిదారులకు సకాలంలో రుణాలు మంజూరు చేసి తద్వారా జిల్లా అభివృద్ధికి బ్యాంకర్లు సహకరించాలని సూచించారు. అనంతరం శాఖల వారీగా లక్ష్యం, ఇప్పటివరకు మంజూరు చేసిన రుణాలు తదితర అంశాలపై చర్చించారు.

విధి నిర్వహణలో అలసత్వం వద్దు

- డీఆర్డీవో విజయలక్ష్మి
- దిలావర్‌పూర్‌లో 14వ విడత సామాజిక తనిఖీ



ప్రజావేదికలో నివేదికలు వినిపిస్తున్న సిబ్బంది

దిలావర్‌పూర్: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా కొనసాగుతున్న పనుల్లో ఎలాంటి అలసత్వం వహించినా, నిధులు దుర్వినియోగం చేసినా కఠిన చర్యలు తప్పవని డీఆర్డీవో విజయలక్ష్మి అన్నారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మంగళవారం నిర్వహించిన 14వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికలో పాల్గొన్నారు. కొన్ని రోజులుగా తనిఖీ బృందం 12 గ్రామ పంచాయతీల పరిధిలో 2023–24ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులకు సంబంధించి పరిశీలన జరిపారు. ఈనేపథ్యంలో నిర్వహించిన సామాజిక తనఖీ ప్రజావేదికలో జరిగిన పనులు, కూలీలకు అందిన వేతనం, తదితర విషయాలకు సంబంధించి నివేదిక సమర్పించారు. మండలంలో జరిగిన రూ.4.80 కోట్లకు సంబంధించిన పనుల వివరాలు ఈవేదికలో వెల్లడించారు. డీఆర్డీవో విజయలక్ష్మి మాట్లాడుతూ మండలంలోని 12 గ్రామ పంచాయతీల పరిధిలో జరిగిన పనులకు సంబంధించి రూ.15,117 సదరు సిబ్బంది నుంచి రికవరీ చేయాలన్నారు. అందుకు రూ.2వేల అపరాధ రుసుం వసూలు చేయాలని ఆదేశించారు. ఎంపీడీవోలు అరుణరాణి, మోహన్, ఏపీవో దివ్యారెడ్డి, హెచ్‌ఆర్ సుధాకర్, సామాజిక తనిఖీ అధికారి నారాయణ, ఏఎస్ఆర్‌పీ సాయిలు, తనిఖీ సిబ్బంది, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పలువురు కూలీలు పాల్గొన్నారు.

తనిఖీ బృందానికి అందని రూ.2.30 కోట్ల వివరాలు..

ఉపాధిహామీ పథకంలో భాగంగా ఆయా గ్రామపంచాయతీల్లో గడిచిన ఆర్థిక సంవత్సరంలో రూ.2.30 కోట్ల వ్యయంతో సీసీ రోడ్లు నిర్మించారు. పనులు పూర్తయినట్లు పంచాయతీరాజ్ శాఖ అధికారులు ఎంబీలు రికార్డులు చేసినా, వాటి నాణ్యత ప్రమాణాలకు సంబంధించి క్వాలిటీ కంట్రోల్ అధికారుల నివేదికలు, జరిగిన పనులకు సంబంధించిన ఎంబీల వివరాలు ఇంతవరకు తనిఖీ బృందానికి చేరలేదు. దీంతో తనిఖీ బృందం మరోమారు సామాజిక తనిఖీ చేపట్టే అవకాశం ఉంది.

రోడ్లను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్, కమిషనర్



రోడ్డును పరిశీలిస్తున్న చైర్మన్, కమిషనర్

సాక్షి స్పందన

నిర్మల్: జిల్లా కేంద్రంలో దారుణంగా ఉన్న రోడ్ల దుస్థితిపై 'ఒక్క రోడ్డూ సక్కగ లేదు..' శీర్షికన 'సాక్షి'లో మంగళవారం ప్రచురితమైన కథనానికి మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, కమిషనర్ రాజు స్పందించారు. మంగళవారం సాయంత్రం డీఈఈ సంతోష్, కోఆప్షన్ సభ్యుడు గోవర్ధన్, సిబ్బందితో కలిసి మున్సిపాలిటీ ఎదుట దెబ్బతిన్న రోడ్డుతోపాటు పలు కాలనీలు, ప్రధాన రహదారిని పరిశీలించారు. త్వరలో మరమ్మతులు చేపడతామని తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలపై రాజీలేని పోరాటం



సభ్యత్వం నమోదు చేయిస్తున్న నరేంద్రబాబు

కుంటాల: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తామని పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.నరేంద్ర బాబు, బీవీ.రమణారావు అన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా కల్లూర్ కేజీబీవీ, కుంటాల ఆదర్శ పాఠశాలలో మంగళవారం పాల్గొని మాట్లాడారు. డీఎస్సీ నియామకాలు సెప్టెంబర్ 5లోగా పూర్తి చేయాలని కోరారు. బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలన్నారు. అర్హులైన ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని, జీవో11, 12 లను సవరించాలని కోరారు. సీపీఎస్ రద్దుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సతీశ్‌కుమార్, నరేశ్‌కుమార్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సబ్బిడి గజేందర్, వెంకట్‌రావు, సిద్ధిరాం, మహేందర్, డి.వెంకట్‌రావు, అమృతం, తాటి సోమేశ్వర్, తిరుపతిగౌడ్, ప్రిన్సిపాళ్లు శ్రీనివాస్ ప్రసాద్, సువర్ణ పాల్గొన్నారు.

చెట్లతోనే జీవరాశి మనుగడ

- అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



మొక్క నాటుతున్న అదనపు కలెక్టర్

నిర్మల్ రూరల్: చెట్లు ఉంటేనే జీవరాశి మనుగడ సాగిస్తుందని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. వన మహోత్సవంలో భాగంగా మండలంలోని అనంతపేట గ్రామంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో గ్రామస్తులకు, విద్యార్థులకు మొక్కల సంరక్షణపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రత్నకుమారి, డీఆర్డీవో విజయలక్ష్మి, ఏపీవో తుల రామకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

రెస్క్యూ.. రెడీ!

- వరుసగా జిల్లాలో వరదలు
- ఆపద వేళ.. ఆదుకునేలా..
- ప్రాణాలు కాపాడుతున్న 'టీమ్'లు
- ఈసారీ ముందస్తుగా శిక్షణ
- రెస్క్యూ బోటులపై అవగాహన



రెస్క్యూబోట్లపై పోలీసులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

నిర్మల్: 2021.. జులై 22.. ఈ తేదీ నిర్మల్ వాసులు ఎప్పుడూ మర్చిపోరు. ఆ రోజు వేకువజామున స్వర్ణనది ఉప్పొంగింది. నిర్మల్‌ను నిండా ముంచెత్తింది. జీఎన్ఆర్ కాలనీ జలప్రళయంలో చిక్కుకుపోయింది. పిల్లాపాపలు, కట్టుబట్టలతో కాలనీవాసులంతా అందుబాటులో ఉన్న రెండతస్తుల భవనాలు ఎక్కి ప్రాణాలు కాపాడుకున్నారు. ఉదయం నుంచి.. సాయంత్రం చీకటి పడే వరకూ అలాగే బిక్కుబిక్కుమంటూ గడిపారు. కొంతమంది స్థానిక యువకులు, గంగపుత్రులు థర్మకోల్ తెప్పలపై వెళ్లి ఒక్కొక్కరిని బయటకు తీసుకొచ్చారు. అప్పటి ప్రభుత్వం హైదరాబాద్ నుంచి ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలను పంపేసరికి రాత్రయ్యింది. హైదరాబాద్ బృందాలు వచ్చేసరికే స్థానికులు కాలనీవాసులను ప్రాణాలకు తెగించి ఒడ్డుకు చేర్చారు. ఆరోజు.. రెస్క్యూ బోట్లు, బృందాలు అందుబాటులో ఉండాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పాయి. ఆ ఘటన తర్వాతే నిర్మల్‌లో ఆ బోట్లు తీసుకురావడంతోపాటు సిబ్బందికి శిక్షణ ఇస్తున్నారు. వరుసగా మళ్లీ రెండేళ్లు ముంపునకు గురవుతున్నా.. ఆ సిబ్బంది ఆపదలో ఆదుకుంటున్నారు. తాజాగా వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో మళ్లీ వారికి శిక్షణ ఇస్తున్నారు.

ముందస్తు శిక్షణ..

మూడేళ్లగా జిల్లాలో ఎప్పుడు భారీ వర్షాలు పడతాయో.. ఎప్పుడు వరదలు ముంచెత్తుతాయో తెలియడం లేదు. గతేడాదీ వరదలు విరుచుకుపడ్డాయి. ఈసారి కూడా జులై, ఆగస్టుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్లు నివేదికలు రావడంతో ముందస్తుగా సిద్ధమవుతున్నారు. విపత్తు నిర్వహణ సేవలనూ రెడీగా ఉంచుతున్నారు. ప్రభుత్వం సూచనతో జిల్లాలో పోలీసుశాఖ తమ సిబ్బందికి బోట్లు, ఇతర రక్షణ చర్యలపై అవగాహన కల్పిస్తోంది. ఇటీవల జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్ చెరువులో రెస్క్యూ బోటుతో మాక్‌డ్రిల్ నిర్వహించారు. వరదల్లో చిక్కుకున్నవారిని ఎలా కాపాడాలో శిక్షణ ఇచ్చారు.

జిల్లాకు మరిన్ని కావాలి..

కొన్నేళ్లుగా జిల్లాను వరదలు వెంటాడుతూనే ఉన్నాయి. నిర్మల్‌ను మాత్రమే భైంసా, కడెం ప్రాంతాలూ నిండా మునుగుతున్నాయి. ఇలాంటి సందర్భాల్లో వరదల్లో చిక్కుకున్న ప్రజలను కాపాడాలంటే అందుకు తగ్గట్లు ఏర్పాట్లు ఉండాలి. జిల్లా కేంద్రంలో ప్రస్తుతం పోలీసుల వద్ద రెస్క్యూబోట్లు, ఇతర సామగ్రి ఉన్నాయి. అగ్నిమాపక, విపత్తు నిర్వహణ శాఖకు ఇచ్చిన పాత బోటు ప్రస్తుతం పనిచేసేలా లేదు. ఇక్కడ మరో కొత్త బోటు ఇవ్వాలి. అలాగే కడెం, భైంసా, బాసర ప్రాంతాల్లోనూ బోట్లు, ఇతర రక్షణ సామగ్రిని అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఉంది.

ప్రాణాలు కాపాడారు..

గతేడాది కూడా నిర్మల్‌లో భారీ వర్షాలు, వరదలతో లోతట్టు, పరివాహక ప్రాంతాలన్నీ నీటమునిగాయి. సిద్ధాపూర్ మీదుగా కొట్ల(కె) వెళ్లేమార్గంలో నిర్మించిన డబుల్‌బెడ్రూం ఇళ్లు సైతం మునిగిపోయాయి. అక్కడ పనిచేస్తున్న దాదాపు 200 మంది కార్మికులు చిక్కుకుపోయారు. స్వర్ణనది నిండుగా పారుతుండటంతో అగ్నిమాపకశాఖ సిబ్బంది రెస్క్యూ బోటు తీసుకుని ఘటన స్థలానికి చేరుకున్నారు. ఆ బోటు ద్వారా వారందరినీ కాపాడారు. అలాగే జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్‌లోనూ ఓ వృద్ధుడిని ఇలాగే పోలీసులు బోటులో బయటకు తీసుకువచ్చి ఆస్పత్రిలో చేర్చారు. జీఎన్ఆర్ కాలనీ ఘటన తర్వాత ఈ బోట్లు ఇవ్వడంతోపాటు అగ్నిమాపక, పోలీసు సిబ్బందికి శిక్షణ ఇవ్వడంతో పలువురి ప్రాణాలను కాపాడగలిగారు.

శిక్షణ ఇచ్చాం..

జిల్లాలో ఎప్పుడు వరదలు వచ్చినా ఆపదలో చిక్కుకున్న వారిని కాపాడేందుకు రెస్క్యూ టీంలకు శిక్షణ ఇస్తున్నాం. ప్రతీ సీజన్‌లో వారికి అవగాహన కల్పిస్తున్నాం. ఈసారి కూడా ముందస్తుగా శిక్షణ ఇప్పిస్తున్నాం.
– జానకీషర్మిల, ఎస్పీ

క్లుప్తంగా

బాసరలో ఆర్జేడీ పూజలు


ఆర్జేడీని సత్కరిస్తున్న అధికారులు

బాసర: బాసర సరస్వతీ అమ్మవారిని మంగళవారం వరంగల్ ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు తీర్థ ప్రసాదాలు, శాలువాతో సత్కరించి పూల మాల అందజేశారు. కార్యక్రమంలో అల్లాపూర్ సుధాకర్, ఎంఈవో మైసాజీ గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను గౌరవించాలి


మాట్లాడుతున్న రాములు మహరాజ్

లోకేశ్వరం: ప్రతి ఒక్కరూ తల్లిదండ్రులను గౌరవించాలని నందిపేట్ పలుగుట్ట బాల యోగి రాములు మహరాజ్ అన్నారు. మంగళవారం మండలంలోని ధర్మోరలో గ్రామస్తుల సహకారంతో చేపట్టిన హనుమాన్ మందిర నిర్మాణ పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తిమార్గంలో నడవాలన్నారు. వ్యసనాలకు గురి కావద్దన్నారు. ఆయన వెంట నాయకులు మామిడి సంజీవ్‌రెడ్డి, రమేశ్‌గౌడ్, సాయాగౌడ్, మంద భాస్కర్, సాయన్న, భూమయ్య, మంద శ్రీధర్, లింగయ్య, చిన్నయ్య, తదితరులు ఉన్నారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

జైనథ్: మండలంలోని డొల్లార గ్రామ సమీపంలో పెన్‌గంగలో గల్లంతైన ఆదిలాబాద్ రూరల్ మండలం చాంద(టి) గ్రామానికి చెందిన కొంత శివ (20) మృతదేహం లభ్యమైంది. సోమవారం డీడీఆర్ఎఫ్ బృందాలు పెన్‌గంగలో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ ఫలితం లేకపోయింది. మంగళవారం డొల్లార గ్రామానికి కూత వేటు దూరంలో పెన్‌గంగ నది ఒడ్డున మృతదేహం నీటిపై తేలడంతో డీడీఆర్ఎఫ్ బృందాలు బయటకు తీశాయి. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించినట్లు సీఐ సాయినాథ్ తెలిపారు.

ఉద్యమకారుల సంఘం ఇన్‌చార్జిగా శ్రావణ్‌నాయక్

కైలాస్‌నగర్: తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జిగా ఆదిలాబాద్ పట్టణానికి చెందిన జాదవ్ శ్రావణ్ నాయక్ నియామకమయ్యారు. ఈ మేరకు ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పిడమర్తి రవి ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలకు అధ్యక్షులను నియమించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా పిడమర్తి రవితో కలిసి ఆయన మంగళవారం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి


మృతి చెందిన గేదె

కడెం: మండలంలోని లింగాపూర్‌లో దేశెట్టి చిన్నరాజన్నకు చెందిన గేదె విద్యుదాఘాతంతో మృతి చెందింది. సోమవారం మేతకు వెళ్లిన గేదెకు గ్రామ సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వైర్లు తగలడంతో విద్యుత్‌షాక్‌కు గురై రాత్రి మృతి చెందింది. గేదె విలువ రూ.80 వేలు ఉంటుందని, ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధిత రైతు వేడుకుంటున్నాడు.

పట్టపగలే చోరీలు..



- నడిరోడ్డుపైనే నగలు లాక్కెళ్తున్న వైనం
- జిల్లాలో వరుసగా దొంగతనాలు
- పక్కా ప్లాన్లతో వస్తున్న దుండగులు
- తాళం వేసిన ఇళ్లు, రద్దీ ప్రాంతాలే లక్ష్యం

నిర్మల్‌టౌన్: జిల్లాలో పట్టపగలే దొంగలు రెచ్చిపోతున్నారు. పోలీసులు ఎంత పకడ్బందీగా చర్యలు చేపడుతున్నా చోరీలు ఆగడం లేదు. సాక్షాత్తూ జిల్లా కేంద్రంలో.. అదికూడా పట్టపగలు ప్రధాన రహదారిపై అందరూ చూస్తుండగానే.. ఓ మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు లాక్కెళ్లారంటే దొంగలు ఎంతకు తెగించారో ఇట్టే తెలిసిపోతోంది. ఇదే రోజు మరో కాలనీలోనూ చైన్‌స్నాచింగ్ జరగడం సంచలనం రేకెత్తించింది. ఇటీవల జిల్లా వ్యాప్తంగా వరుసగా చోరీలు, చైన్‌స్నాచింగ్‌లు జరుగుతుండటం జిల్లా వాసులను కలవర పెడుతున్నాయి.

ఇంటికి తాళముంటే.. దోసుడే..

ఇంటికి తాళం వేసి ఊరెళ్తున్నారా..? అయితే జాగ్రత్త.. ఎందుకంటే మీరు అలా వెళ్లగానే మీ ఇంట్లో దొంగలు పడే ప్రమాదం ఉంది. గతంలో వేసవిలో రాత్రివేళ దొంగతనాలు జరిగేవి. కానీ ప్రస్తుతం సీజన్ ఏదైనా ఉదయం, రాత్రితో సంబంధం లేకుండా దొంగలు తమ పని కానిచ్చేస్తున్నారు. పక్కా ప్లాన్‌తో తాళం వేసిన ఇండ్లు దుకాణాల్లో నగదు, విలువైన వస్తువులతో పాటు, వాహనాలను కూడా ఎత్తుకెళ్తున్నారు. మార్కెట్, బస్టాండ్ తదితర రద్దీ ప్రదేశాల్లో మొబైల్ ఫోన్లు, చైన్‌స్నాచింగ్‌కు పాల్పడుతున్నారు.

పోలీసుల కళ్లు గప్పి...

నిఘా విభాగంలో ఎంతో అభివృద్ధి చెందిన ఈ రోజుల్లో కూడా దొంగలు పోలీసుల చేతికి చిక్కకుండా తప్పించుకు తిరుగుతుండడం గమనార్హం. రాత్రి, పగలు పోలీసులు గస్తీ కాస్తున్నా వారి కళ్లు గప్పి మరి దొంగలు తమ చేతికి పని చెబుతున్నారు. పోలీసులకు ఎటువంటి ఆనవాళ్లు దొరకకుండా జాగ్రత్త పడుతున్నారు. వరుస చోరీలకు పాల్పడుతూ పోలీసులకు చెమటలు పట్టిస్తున్నారు.

పక్క రాష్ట్రం నుంచి..

నిర్మల్ జిల్లా సరిహద్దులో మహారాష్ట్ర ఉండడంతో నిత్యం రాకపోకలు కొనసాగుతుంటాయి. అంతేకాకుండా జిల్లాలో 44, 61వ జాతీయ రహదారులు ఉండడంతో ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుండి వచ్చిన వ్యక్తులు నేరుగా దొంగతనాలు చేసి పారిపోతున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

చైన్ స్నాచింగ్‌లు..

జిల్లా కేంద్రంలో మంగళవారం పట్టపగలే బైక్ వచ్చిన దొంగలు వేర్వేరు చోట్ల ఇద్దరు మహిళల మెడలో నుంచి చైన్‌లు లాక్కెళ్లారు. స్థానిక మయూరి హోటల్ సమీపంలోని వైన్స్ ఎదుట ప్రధాన రహదారిపైనే అందరూ చూస్తుండగా చైన్‌స్నాచింగ్ జరగడం తీవ్ర సంచలనమైంది. జిల్లా వ్యాప్తంగా ఇది చర్చనీయాంశంగా మారింది. అలాగే శాస్త్రినగర్‌లో బైక్‌పై వచ్చిన దొంగలు మరో మహిళ మెడలోనుంచి గొలుసు లాక్కెళ్లడం కలవర పెట్టింది. దీంతో మహిళలు ఒంటరిగా బయటకు వెళ్లాలంటేనే భయభ్రాంతులకు గురవుతున్నారు.

ఇటీవల జరిగిన కొన్ని ఘటనలు..

- ఈ నెల 12న జిల్లా కేంద్రంలోని సోమవార్‌పేట్ కాలనీకి చెందిన శ్రావణి ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లింది. సాయంత్రం ఇంటికి వచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లో ఉన్న రూ.10 వేల నగదు ఎత్తుకెళ్లారని వాపోయింది.
- ఈనెల 14న కుభీర్‌లో అద్దె ఇంట్లో ఉండే వ్యక్తి తాళం వేసి ఊరికి వెళ్ళాడు. తిరిగి వచ్చి చూసేసరికి ఇంటి ముందర ఉన్న బైక్, ఇంట్లో ఉన్న రూ.7 వేల నగదు ఎత్తుకెళ్లారు.
- గత వారం దిలావర్‌పూర్ మండలం సిర్గాపూర్‌లో ఉన్న ఓ వైన్‌షాపు తాళాలు రాత్రి సమయంలో పగలగొట్టి రూ.3 వేల నగదును దొంగిలించారు.
- ఈనెల 20న నర్సాపూర్(జి) గ్రామ శివారులోని నీలిమ వైన్స్, తెల్ల కళ్ళు దుకాణాల షట్టర్ తాళాలు పగులగొట్టి సీసీ కెమెరాలు ధ్వంసం చేసి నగదు ఎత్తుకెళ్లారు.
- ఈనెల 20న జిల్లా కేంద్రంలోని విశ్వనాథ్‌పేట్‌లో గల రెండు పాన్‌షాపుల తాళాలు పగలగొట్టి రూ.10 వేల నగదు అపహరించారు.
- ఈనెల 22న ఖానాపూర్ పట్టణంలోని ఓ ఇంట్లో దొంగలు పడి ఐదు తులాల బంగారం ఎత్తుకెళ్లారు.

ప్రతీ విద్యార్థికి చదవడం, రాయడం రావాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా


విద్యార్థులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో

బేల: ప్రతీ విద్యార్థికి చదవడం, రాయడం తప్పనిసరిగా రావాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎస్టీ బాలుర ఆశ్రమోన్నత పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న విద్య, భోజనంపై ఆరా తీశారు. ఉపాధ్యాయుల హాజరు, స్టాక్ రిజిష్టర్లను పరిశీలించారు. తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు బోధించారు. విద్యార్థులను సబ్జెక్టుల వారీగా ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం పోషక విలువల ఆహారం అందించాలన్నారు. వర్షాల నేపథ్యంలో వసతిగృహ పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఉపాధ్యాయులు లక్ష్మణ్, దిలీప్, జ్యోతి, సుమిత్రల సెలవును హాజరు రిజిష్టర్‌లో నమోదు చేయకపోవడంతో ఇన్‌చార్జి హెచ్‌ఎం జి.శ్వేతకు షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఐదురోజులుగా సమాచారం లేకుండా విధులకు గైర్హాజరైన ఉపాధ్యాయుడు దశరథ్‌కు షోకాజ్ నోటీసు ఇచ్చా రు. ఇక్కడ పనిచేస్తున్న శంభు తన స్థానంలో వేరే వాళ్లతో పనిచేయిస్తుండడంతో ఆగ్రహం వ్యక్తం చేశా రు. ఇకనుంచి ఎవరి ఉద్యోగం వారే చేయాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులను పెట్టకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఏటీడీవోను ఆదేశించారు. నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆర్జీయూకేటీలో ముగిసిన దివ్యాంగుల కౌన్సెలింగ్


విద్యార్థినికి పత్రాన్ని అందజేస్తున్న స్పెషల్ ఆఫీసర్

బాసర: నిర్మల్ జిల్లా బాసరలోని రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయంలో ఆరు సంవత్సరాల సమీకృత విద్యనభ్యసించేందుకు పీయూసీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం దివ్యాంగ విద్యార్థులకు మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. వర్సిటీ ప్రాంగణంలోని అకడమిక్ బ్లాక్‌లో దివ్యాంగ విద్యార్థులకు ధ్రువపత్రాల పరిశీలించారు. ఉదయం 9 గంటల నుంచి ధ్రువపత్రాల పరిశీలన ప్రారంభించారు. స్పెషల్ ఆఫీసర్ సృజన మాట్లాడుతూ ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ వెంకటరమణ ఆదేశాల మేరకు అడ్మిషన్ల కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని తెలిపారు. సిద్దిపేట జిల్లా పెద్ద లింగారెడ్డి గ్రామానికి చెందిన హారికకు ఎంపిక ధ్రువపత్రాన్ని స్పెషల్ ఆఫీసర్ సృజన, కన్వీనర్ డాక్టర్ చంద్రశేఖర్ అందజేశారు. మిగిలిన సీట్ల ఖాళీలను మూడో విడతలో భర్తీ చేస్తామని, దానికి సంబంధించిన జాబితాను త్వరలో విడుదల చేస్తామని తెలిపారు. గ్లోబల్ కోటా స్వరాష్ట్రం సీట్లను సైతం భర్తీ చేస్తామని తెలిపారు. కౌన్సెలింగ్‌లో జాయింట్ కన్వీనర్లు రంజిత్‌కుమార్, డాక్టర్ దత్తు, అడ్మిషన్స్ కమిటీ సభ్యులు హరికృష్ణ, సునీత, డాక్టర్ కుమార్ రాగుల, శ్రీకాంత్, రాకేశ్‌రెడ్డి, ఉద్యోగులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూసీ, ఎస్బీఐ క్యాంపస్ బ్రాంచ్ అధికారులు పాల్గొన్నారు.

ఒకేరోజు రెండు చోట్ల చైన్‌స్నాచింగ్


మయూరి హోటల్ వద్ద ఘటన సీసీ ఫుటేజీ

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని మయూరి హోటల్ వద్ద ఓ మహిళ నడుచుకుంటూ వెళ్తుండగా బైక్‌పై హెల్మెట్ ధరించి వచ్చిన ఇద్దరు దుండగులు ఆమె మెడలో నుంచి తులం బంగారు గొలుసు ఎత్తుకెళ్లారు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు సీసీ కెమెరాలో దృశ్యాలను పరిశీలించారు. మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెందిన మహిళ నిర్మల్‌లో ఉంటున్న తన కూతుర్ని చూడడానికి వచ్చిన సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది.

శాస్త్రినగర్‌లో...

జిల్లా కేంద్రంలోని మంజులాపూర్ కాలనీకి చెందిన ఓ మహిళ శాస్త్రినగర్‌లోని తన బంధువుల ఇంటికి వెళ్తుండగా ఇద్దరు గుర్తు తెలియని దుండగులు బైక్‌పై వచ్చి ఆమె మెడలో నుంచి రెండు తులాల బంగారు గొలుసు ఎత్తుకెళ్లారు. మహిళా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

నిర్మల్ డిగ్రీ కళాశాల అరుదైన ఘనత


ధ్రువీకరణపత్రంతో కూడిన మెమొంటోను అందజేస్తున్న హైమ్ సంస్థ ప్రతినిధి



అంతర్జాతీయ సంస్థ ధ్రువీకరణపత్రం ఇదే

- మూడు విభాగాల్లో ఉత్తమ పురస్కారాలు
- డిగ్రీ కళాశాలకు అంతర్జాతీయ సంస్థ గుర్తింపు

నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అరుదైన ఘనతను చాటుకుంది. డిగ్రీ కళాశాలలో మంచి వసతులతోపాటు నాణ్యమైన విద్యా బోధనాభ్యసన చేపడుతుండడంతోపాటు విద్యా ప్రమాణాలు, వనరుల నిర్వహణ, పర్యావరణం తదితర విభాగాల్లో అంతర్జాతీయ సంస్థ గుర్తింపు లభించింది. ప్రతిష్టాత్మక 'హైమ్ అంతర్జాతీయ సంస్థ' ఆడిట్ ప్రతినిధులు కళాశాలను సందర్శించి వివిధ విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కళాశాలలో మౌలిక వసతులు, క్రీడామైదానం, ప్రహరీ, తరగతి గదులు, పరిపాలన విభాగం, కంప్యూటర్ ల్యాబ్, గ్రంథాలయం, వర్చువల్ ప్రయోగశాల, ఇంగ్లిష్ భాష ప్రయోగశాల, తెలంగాణ స్కిల్ అండ్ నాలెడ్జి ల్యాబ్, భౌతిక, రసాయన, జంతు, వృక్షశాస్త్ర ప్రయోగశాలలతోపాటు జంతుశాస్త్ర మ్యూజియం, సెమినార్ హాల్, డిజిటల్ క్లాస్‌రూమ్, పార్కింగ్ స్థలం, బొటానికల్ గార్డెన్, క్రీడా సామగ్రి, నీటి వసతులు పర్యావరణ నిర్వహణ వంటి వాటిని సమగ్రంగా పరిశీలించారు. వీటితోపాటు పరిపాలన విభాగం నిర్వహణ, అకడమిక్ రికార్డ్స్ విద్యార్థులకు కల్పిస్తున్న వసతులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయా విభాగాలకు సంబంధించిన ధ్రువపత్రాలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జే.భీమారావుకు మంగళవారం అందజేశారు. అంతర్జాతీయ సంస్థ గుర్తింపు రావడంపై ప్రిన్సిపాల్‌తోపాటు కళాశాల అధ్యాపకులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు విదేశాలలో చదవాలనుకునే వారికి మంచి గుర్తింపు ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు హైమ్ అంతర్జాతీయ సంస్థ ప్రతినిధులు ఉత్తమ విద్యా ప్రమాణాలు–నిర్వహణ, ఉత్తమ వనరుల నిర్వహణ, ఉత్తమ పర్యావరణ నిర్వహణ అనే మూడు విభాగాలలో ధ్రువీకరణ పత్రాలను మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో హైమ్ సంస్థ ప్రతినిధి శివ, కళాశాల అధ్యాపకులు అతీక్ బేగం, రఘు, అరుణ్‌కుమార్, అజయ్, పీజీ.రెడ్డి, రవికుమార్, రమాకాంత్‌గౌడ్, సరితారాణి, నరసయ్య, నాగేశ్వర్, శంకర్, శ్రీహరి, ఏవో నాగ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ కమిటీ పనులపై కలెక్టర్ ఆగ్రహం


అర్జుని మారుగూడ రోడ్డును పరిశీలిస్తున్న కలెక్టర్

నార్నూర్: మీ ఇంట్లో వస్తువు పాడైతే ఇలాగే వదిలేస్తారా? ఇంత నిర్లక్ష్యం ఎందుకని కలెక్టర్ రాజర్షిషా ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం గాదిగూడ మండలంలోని పర్సువాడ కే ఎంపీపీఎస్ ప్రభుత్వ పాఠశాలలో అమ్మ అదర్శ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన పనులను పరిశీలించారు. పాఠశాలలో మంచి నీటి సౌకర్యం ఎందుకు కల్పించలేదని ప్రశ్నించగా హెచ్‌ఎం బదిలీపై వెళ్లాడని, తాను చార్జి తీసుకుని రెండురోజులు మాత్రమే అవుతుందని ఉపాధ్యాయురాలు రమబింధు తెలిపారు. పనులు ఎందుకు అసంపూర్తిగా ఉన్నాయని ఐటీడీఏ డీఈ శివప్రసాద్‌ను ప్రశ్నించారు. 31 మంది విద్యార్థులకు ఒక్కరే ఉపాధ్యాయులు ఉన్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా బేల ఎంఈవోతో మాట్లాడి బదిలీ అయిన ఉపాధ్యాయుని వెంటనే రిలీవ్ చేయాలని ఎంఈవో రాపల్లి ఆశన్నను ఆదేశించారు. ధర్మగూడ గ్రామానికి వెళ్లే రోడ్డు కోతకు గురి కావడంతో గ్రామస్తులతో కలిసి వెళ్లి పరిశీలించారు. రోడ్డు పనులు వెంటనే చేపట్టాలని పీఆర్ జేఈ లింగన్నను ఆదేశించారు. అనంతరం అర్జుని గ్రామ పంచాయతీ పరిధిలోని మారుగూడ వాగును పరిశీలించారు. ఝరి పీహెచ్‌సీని తనిఖీ చేసి రిజిస్టర్లు పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ విజయానందం, ఎంపీడీవో రమేశ్, సీడీపీవో శారద, ఐటీడీఏ డీఈ శివప్రసాద్, ఎంఈవో రాపల్లి ఆశన్న, తదితరులు ఉన్నారు.

మద్రాస్ ఐఐటీలో ముధోల్ విద్యార్థికి సీటు


విద్యార్థి అమన్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ముధోల్: ముధోల్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదివిన జెడ్.అమన్ మద్రాస్ ఐఐటీలో సీటు సాధించినట్లు ప్రిన్సిపాల్ వేణుగోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో అమన్‌ను ఉపాధ్యాయులు సన్మానించారు. ఉపాధ్యాయులు భాస్కర్, రాములు, శ్రీధర్, సీతారాం, ప్రేమ్‌కుమార్, రవీందర్ పాల్గొన్నారు.

ఎంపీటీసీని సన్మానించిన కలెక్టర్


మెమొంటో అందజేస్తున్న కలెక్టర్

ఇచ్చోడ: మండలంలోని ముఖరా(బి) మాజీ ఎంపీటీసీ గాడ్గే సుభాష్‌ను మంగళవారం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ దోత్రే శాలువాతో సత్కరించి మెమొంటో అందజేశారు. ఆసిఫాబాద్ కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రామీణ స్వచ్ఛ భారత్ శిక్షణ శిబిరానికి గాడ్గే సుభాష్ ప్రత్యేక ఆహ్వానితులుగా వెళ్లి పంచాయతీ అభివృద్ధిపై అనుభవాలు వివరించారు. తడి, పొడి చెత్త ద్వార వర్మికంపోస్టు తయారు చేసి ఆదాయం సంపాదించిన విషయంలో కలెక్టర్ అభినందించినట్లు తెలిపారు.

ఘనంగా శీత్లాభవాని పండుగ


పూజలు చేస్తున్న బంజారాలు


సంప్రదాయ దుస్తుల్లో మహిళలు

ఖానాపూర్: మండలంలోని బీర్నంది, సత్తన్‌పల్లి, బావాపూర్(ఆర్) తదితర గ్రామాల్లో శీత్లాభవాని పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బంజారా కులస్తులు గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు.

జాతీయ కిక్ బాక్సింగ్ పోటీలకు నిర్మల్ యువకుడు


తుమ్మల శశివర్ష

నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ జిల్లాకేంద్రంలోని ప్రియదర్శిని నగర్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు తుమ్మలదేవరావు తనయుడు తుమ్మల శశివర్ష జాతీయస్థాయి కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల వనపర్తిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చడంతో అధికారులు జాతీయ పోటీలకు ఎంపిక చేశారు. ఈనెల 24 నుంచి 28 వరకు గోవాలో జరిగే జాతీయ కిక్ బాక్సింగ్ పోటీల్లో శశివర్ష పాల్గొంటారు. శశివర్ష గతంలో కరాటేలో జాతీయ పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించాడు. కిక్ బాక్సింగ్‌లో రాణిస్తూ జాతీయస్థాయిపోటీలకు ఎంపికవడంపై జిల్లా కిక్ బాక్సింగ్ అధ్యక్షుడు చందల స్వామి, జిల్లా క్రీడల అధికారి శ్రీనివాస్ అభినందించారు.

భార్య కాపురానికి రావడంలేదని ఆత్మహత్య

నార్నూర్: మండల కేంద్రంలోని జీన్‌గూడకు చెందిన సయ్యద్ ఆసిఫ్ (22) మంగళవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రవికిరణ్ తెలిపారు. జీన్‌గూడకు చెందిన సయ్యద్ ఆసిఫ్‌కు ఈ ఏడాది ఏప్రిల్ 29న ఆదిలాబాద్ పట్టణానికి చెందిన రేషమ్‌తో వివాహమైంది. ఇటీవల పుట్టింటికి వెళ్లిన రేషమ్ మళ్లీ తిరిగిరాలేదు. దీంతో మనస్తాపానికి గురయ్యాడు. సోమవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తండ్రి సయ్యద్ ఆజం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్లకు గాయాలు

సోన్: మండల కేంద్రంలోని ఫారెస్ట్ చెక్‌పోస్ట్ వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్లకు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై కే.గోపి, ఫారెస్ట్ బీట్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్ర నుంచి గోధుమ లోడ్‌తో లారీ హైదరాబాద్ బయలుదేరింది. సోన్ చెక్‌పోస్ట్ వద్ద అటవీ సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తుండగా నిలిపి ఉన్న బొలెరో, పికప్ వాహనాలను లారీ బలంగా ఢీకొట్టింది. ముందున్న రెండు వాహనాల డ్రైవర్లకు స్వల్ప గాయాలయ్యాయి. క్షత గాత్రులను అంబులెన్సులో ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై గోపి తెలిపారు.

నిర్లక్ష్యానికి నిలువుటద్దం..



విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యానికి ఈ చిత్రం నిలువుటద్దంగా నిలుస్తోంది. సింగిల్ ఫేస్ 15 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మావల మండలంలోని మురుగునీటి కాలువలో పడేసి ఉంది. ఒకవేళ అది చెడిపోయినప్పటికీ కూడా విద్యుత్ శాఖ కార్యాలయానికి తీసుకొచ్చి మరమ్మతులు చేయించాలి. కానీ నిర్లక్ష్యంగా పడేయడం పట్ల పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్